క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ మందలమ్మ 45వ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు బంకుపల్లి వెంకటగోపాలరావు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు, హోమాలు చేపట్టారు. మధ్యాహ్న అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేలం పాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం మార్కెట్ ఆశీలు వేలంపాట రూ.4.34,000 ఖరారైంది. శ్రీముఖలింగంలో గురువారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్.వెంకటేష్ వేలం పాటను దక్కించుకున్నారు. పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 201 మంది ఎంపిక



నియకపత్రాలు అందజేస్తున్న అధికారులు, ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హాజరయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా దూరంతో సంబంధం లేకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 456 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 201 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యురాలు ఉమాగౌరి

పాతపట్నం: గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెంబూరు హోమియో ఆస్పత్రి వైద్యురాలు ఎస్.ఉమాగౌరి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ, పోషణ విలువలు, ఆరోగ్యకరమైన ఆహార స్వీకరణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ అన్నెపు సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ కె.రాంబాబు సూచించారు. చిన్నకోరాడ ప్రభుత్వ పాఠశాల పరిధిలో గురువారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధనతోపాటు అన్నిరకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. చదువుకు సాయంతోపాటు మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు, అన్నిరకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ ధనుంజయరావు, పీఎంసీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాలకు.. చంద్ర గ్రహణం



ఆమదాలవలస మున్సిపాలిటీ 7వ వార్డు చింతాడలో అరకొర సేవలు అందిస్తున్న సిబ్బంది

- పూర్తిస్థాయిలో ప్రజలకు అందని సేవలు
- నేడు వెలవెలబోతున్న కార్యాలయాలు
- సేవలు తగ్గించిన కూటమి సర్కార్
- మళ్లీ మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న జనం
- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాలను కుదించేందుకు చర్యలు



బూర్జ మండలంలోని ఏపీపేట గ్రామ సచివాలయ భవనం

ఆమదాలవలస: గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఏ చిన్న పని ఉన్నా వేకువ జామునే లేచి మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో బయల్దేరాల్సి వచ్చేది. ఆ రోజు పని పూర్తిగా పోయేది. సమస్యలపై రోజుల కొద్దీ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఈ విషయాన్ని గ్రహించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయిలోనే అందించేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతీ 2 వేల కుటుంబాలకు ఓ సచివాలయం ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. పది మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. 536 రకాల సేవలను అందించారు. ప్రతీరోజు గ్రీవెన్స్ ఏర్పాటుచేసి వచ్చిన ప్రతీ అర్జీకి పరిష్కారమార్గం చూపేవారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించేవారు. సంక్షేమ పథకాలు అందించడంలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

సచివాలయాలపై చిన్నచూపు...

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న వలంటీర్ వ్యవస్థ ఉనికిలేకుండా పోయింది. వలంటీర్ల విధులను సచివాలయ సిబ్బందికి కేటాయించడంతో వారు కార్యాలయం కంటే గ్రామాల్లోనే వివిధ పనుల నిమిత్తం తిరుగుతున్నారు. దీంతో సేవలు అందక ప్రజలు మండల కేంద్రాల్లోని కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో 87 సచివాలయాలు..

ఆమదాలవలస నియోజకవర్గంలో 87 సచివాలయాలున్నాయి. ప్రస్తుతం కొన్ని పోస్టులు ఖాళీలు ఉండగా.. వివిధ శాఖలకు చెందిన 828 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వలంటీర్లు చేయాల్సిన పింఛన్ పంపిణీతోపాటు సర్వేల పేరుతో పని భారం మోపుతున్నారు. ప్రజలకు అందించే సేవలు మాత్రం అందడంలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో 2021లో సచివాలయాల ద్వారా 4.08 లక్షల మందికి, 2022లో 4.15 లక్షల మందికి, 2023లో 4.18 లక్షల మందికి, 2024లో 3.02 లక్షల మందికి సేవలు అందాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ 10 నెలల్లో 30 వేల మందికి కూడా సేవలు అందించలేకపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సచివాలయాల ద్వారా అందించే సేవల్లో దాదాపు 75 శాతం సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది.

ప్రజల ఆవేదన..

కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో రెండు సచివాలయాలను ఒకచోట ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇలాచేస్తే సచివాలయ సేవలు మరింత దూరమవుతాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో సచివాలయాలు, సిబ్బంది వివరాలు..

మండలం	ఆమదాలవలస	ఆమదాలవలస మున్సిపాలిటీ	సరుబుజ్జిలి	బూర్జ	పొందూరు
సచివాలయాలు	19	11	14	16	27
ఉద్యోగులు	186	99	138	156	249

మంచి వ్యవస్థను నిర్వీర్యం చేయవద్దు



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ సచివాలయాల్లో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. గ్రామంలోనే అన్ని సేవలు అందుతుండడంతో గత ఐదేళ్ల పాటు ప్రజాదరణ పొందాయి. వీటిద్వారా ప్రజలకు మంచి జరుగుతున్నప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం తగదు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తే.. ప్రజలకు ఇంటి వద్దకే సేవలందుతాయి.

– బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ఆమదాలవలస మున్సిపాలిటీ

సచివాలయాలను కొనసాగించాలి



ప్రతి పంచాయతీలో సచివాలయం ఉండడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయ సిబ్బంది ఫీల్డ్ వర్క్‌ల కోసం వెళ్లా.. సచివాలయాలకు సరిగ్గా రావడం లేదు. ఎన్నో ప్రయాసలు పడి మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది. మళ్లీ 2014-2019 మధ్య పరిస్థితులు నెలకొంటున్నాయి.

– కొల్లి జగన్, రామచంద్రపురం, ఆమదాలవలస మండలం

నీటి కుంటల తవ్వకానికి అవకాశమివ్వండి

- తహసీల్దార్‌ను కోరిన జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: మండలంలోని బొద్దాం పంచాయతీలో వేరుశనగ పంట నీరులేక ఎండిపోతున్న నేపథ్యంలో ఆఖరి తడుల కోసం అక్కడి చెరువుల్లో కుంటలు తవ్వుకోవటానికి అవకాశమివ్వాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. రైతులతో కలిసి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కొంతమంది కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా రైతులే బాధ్యత తీసుకుంటారని చెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ సైతం సానుకూలంగా స్పందించారు. పంటకాలం తరువాత రైతులే సదరు కుంటలను పూడ్చాలని సూచించారు. ప్రమాదవశాత్తు పశువులు, చిన్న పిల్లలు అందులో పడిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల యువజన, ఎస్సీ విభాగం అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, కె.లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, బొద్దాం సర్పంచ్ బెండి శ్రీనివాసరావు, నాయకులు గురుగుబెల్లి భాస్కరరావు, చింతు రామకృష్ణ, పాలిన అప్పన్న, దుర్గు అచ్చెయ్య, వై.వి.రమణ, అప్పిన చిట్టిబాబు పాల్గొన్నారు.

రికవరీలు చెల్లించాల్సిందే..

- విజిలెన్స్ అధికారి స్వరూపారాణి



సామాజిక తనిఖీ రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి స్వరూపారాణి

మెళియాపుట్టి: సామాజిక తనిఖీల్లో గుర్తించిన అభియోగాలకు సంబంధించి రికవరీలు తప్పనిసరిగా చెల్లించాలని విజిలెన్స్ అధికారి స్వరూపారాణి అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. గత సామాజిక తనిఖీల్లో గుర్తించిన అభియోగాలపై విధించిన ఫైన్లు, రికవరీల ఫైల్స్ పరిశీలించి, సిబ్బంది నుంచి కొంత మొత్తం సొమ్మును వసూలు చేశారు. అదేవిధంగా తనిఖీ బృందం గుర్తించిన నాటికి అసంపూర్తిగా ఉన్న పని వద్ద సూచికలు, చనిపోయిన మొక్కల ప్రదేశంలో తిరిగి మొక్కలు నాటినట్లు దిగిన ఫొటోలు, తగిన ఆధారాలను ఉపాధి సిబ్బంది చూపించారు. ఏపీఓ తెంబూరు రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పోరాటాలకు సిద్ధం కావాలి

కొత్తూరు: విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటాలకు వినియోగదారులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. కొత్తూరులో గురువారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టి అదానీకి వేల కోట్లు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన కలిగే నష్టాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామన్నారు. సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, ఎస్.ముఖలింగం పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

కొత్తూరు: నాలుగు నెలల నుంచి బకాయిపడిన వేతనాలను ఉపాధి హామీ పథకం వేతనదారులుకు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో పలు గ్రామాలకు చెందిన ఉపాధి వేతనదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉపాధి పనిపైనే ఆధారపడినవారు పస్తులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. పనుల వద్ద మెడికల్ కిట్లు, మంచి నీళ్లు, టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో వేతనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

తనిఖీలు

పొందూరు: స్థానిక మహారాజా మార్కెట్‌లోని దుకాణాలతోపాటు ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లలో డాగ్ స్క్వాడ్‌తో గురువారం ఎస్ఐ వి.సత్యనారాయణ తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగ్‌లు, వాహనాలను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని ఎస్ఐ చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

సత్యసాయి పల్లకీ సేవ..



పల్లకీసేవ నిర్వహిస్తున్న సాయి భక్తులు

నరసన్నపేట: స్థానిక బొడ్డవలస, జోగిపేటల్లో గురువారం ఉదయం సత్యసాయి బాబా పల్లకీ సేవను భక్తులు నిర్వహించారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పల్లకీ సేవ చేపట్టారు. టెక్కలి జోన్ కోటబొమ్మాళి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ పల్లకీ సేవ, నగర సంకీర్తన, సత్సంగం నిర్వహించారు. సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడివలస ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ టి.అంకాల్ అన్నారు. మండలంలోని బెలమాం గ్రామంలో డ్వాక్రా మహిళలకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఏస్టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఏటీఎం పిన్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సోషల్ సొసైటీ ట్రాన్స్ఫర్మేషన్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్(చిన్ను), జిల్లా కోఆర్డినేటర్ ఎ.హరనాథ్, లీడ్ బ్యాంక్ ఫెసిలిటీ లిటరేచర్ కౌన్సిల్ సభ్యుడు సువ్వారి రవిబాబు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పాతపట్నం: ఈ నెల 21వ తేదీన ఏపీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2025–26లో 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి గురువారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్చడం జరిగిందన్నారు. ఉదయం పది గంటలకు ఏపీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

హిరమండలం: కొలతల ప్రకారం పనులు చేపడితే కనీస వేతనం గిట్టుబాటు అవుతుందని ఉపాధి ఏపీఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గులుమూరు పంచాయతీ పరిధిలోని ఊర చెరువులో రూ.9.80 లక్షలతో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. వేతనదారులకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. రోజు వేతనం రూ.300 అందేలా కొలతలు వేసి పనులు అప్పగించడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేతనదారులకు సూచించారు.

ధాన్యం బస్తాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



సారవకోట: మండలంలోని మదనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ధాన్యం బస్తాలు నిల్వ చేయడంపై సాక్షిలో ఈ నెల 7న వార్త ప్రచురితమైంది. దీనిపై విద్యా శాఖాధికారులు బుధవారం స్పందించారు. ధాన్యం బస్తాలు వేసిన రైతులతో మాట్లాడి వాటిని తొలగించారు.

అభినందన



సారవకోట మండలంలోని అలుదు పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులను హెచ్‌ఎం తంప రామారావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ పాఠశాల విద్యార్థులు విజయవాడకు చెందిన డ్రీమ్స్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. 14 మందికి బంగారు, 14 మందికి వెండి పతకాలు వచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు రమేష్‌కు ప్రత్యేకంగా అభినందించారు.

– సారవకోట

జోరుగా ఇటుకల తయారీ..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట వద్ద ఇటుకల తయారీ కేంద్రం. మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటుకల తయారీ జోరందుకుంది. ఐదారు నెలల క్రితం వరకు ట్రాక్టర్ లోడు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముతున్నారు. బొర్రంపేట, ముంగెన్నపాడు రోడ్డు, సిద్ధాంతం రోడ్డు, కోవిలాం కాలనీ, యంబరాం రోడ్డుతోపాటు మండల కేంద్రంలో ఇటుకల తయారీ కేంద్రాలున్నాయి. ఇటుక బట్టీలన్నీ అలికాం–బత్తిలి రోడ్డు పక్కనే ఉన్నాయి. వీటి నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

ఆకట్టుకున్న వేషధారణలు



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 3వ వార్డు ఊసవానిపేటలో శ్రీరామ నవమి ఉత్సవాలు వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం గ్రామం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వేసిన వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– ఆమదాలవలస

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య



నరసన్నపేట: మాట్లాడుతున్న కృష్ణచైతన్య

పోలాకి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు అప్పగించిన నాయకులుతో గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, కష్ట కాలంలో పార్టీకి నాయకత్వం వహించిన వారికి భవిష్యత్‌లో గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, యువత, మత్స్యకారులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసగించిన నేపథ్యంలో జగనన్న పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ప్రతీ పంచాయతీ నుంచి నాయకత్వం వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు వై.వి.రమణ, తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీలో వివిధ విభాగాల బాధ్యులు, తదతరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి యువతే వెన్నెముక

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల పార్టీ నియమించిన నియోజవర్గ యువ విభాగం మండల శాఖ అధ్యక్షులతోపాటు మిగిలిన కార్యవర్గాన్ని గురువారం పరిచయం చేశారు. యువజన విభాగం అధ్యక్షులు బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేయాలన్నారు. నాలుగు మండలాల అధ్యక్షులను కృష్ణచైతన్య సత్కరించారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దండి జయప్రకాశ్, మండలాల అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, జుత్తు నేతాజీ, రెంటి కోట త్రినాథరావు, కొండాల బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్టు ఆక్రమణ



కాలువ గట్టును కప్పేసి రోడ్డు వేసిన టీడీపీ నాయకులు

ఆమదాలవలస: మండంలోని అక్కివరం పంచాయతీ పరిధిలో గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని కాలువ గట్టును కొంతమంది టీడీపీ నాయకులు ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాలువ గట్టును కప్పేయడంతో ఎగువున ఉన్న పొలాల నుంచి దిగువ పొలాలకు నీరు రావడం కష్టం అవుతుందన్నారు. వరదలు, తుఫాన్‌లు వచ్చినప్పుడు నీరు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉండటంతో విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతంలో నిర్మిస్తున్నారన్నారు. ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ఆక్రమణలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.